# రాగసుధారసం

**మా** శ్రీవారు ఎడమ వైపు నుండాల్సిన జేబును కుడివైపున కుట్టాడని టైలరు మీద విసుక్కుంటున్నారు. "కుడి ఎడమైతే పొరపాటు లేదోయ్" అన్నాను భైరవిలో. కొంచెం "యాంగ్రీ" గా చూశారు, "యాంగ్రీ"గా వున్నప్పుడు మొగాళ్లైనా చూడ్డానికి ఫరవాలేదు. బావున్నా ననిపిస్తారు. ఆ జేబు తీసేసి ఎడమ వైపున కుట్టిపెట్టమని అడిగారు. రేడియోలో కూడా భైరవిలోనే "ఉపచారము చేసేవారున్నారని మరువకురా" అన్న త్యాగరాయ కీర్తన చక్కగా వినిపిస్తోంది. భోంచేశాక కుడతానన్నాను. "భోంచేశాక అంటున్నావు నువ్వా నేనా" అన్నారు.

"మనమిద్దరమూనూ" అన్నానన్నవ్వుతూ మీ ఆడవాళ్లకు జేబుల సంగతేం తెలుస్తుంది. మీకు జేబులుండవు కదా అని జాలీగా అన్నారు. పాయింటే సుమండీ...ఏ ఆడదైనా జేబుల సరదా తీర్చుకోవాలంటే మొగుడి జేబుల్లోనే కదా చేతులుపెట్టాల్సింది అన్నాన్నేను. ఏ జేబులో ఏ పావుంటుందో అలా జేబుల్లో చేతులు పెట్టరాదు అన్నారు. బస్సువాడు కిటికీలోంచి చేతులు బయట పెట్టరాదు. హరేరామ హరేకృష్ణ అన్నట్టు స్త్రీలకు పాకెట్ మనీ అని యివ్వకూడదు. ఎందుకంటె వారికి పాకెట్లు వుండవు కదా అన్నారు. పెళ్ళాల కొళ్ళు మండిపోయేలాటి చిరునవ్వు విసూర్తూ, చీరలకు పాకెట్టుండకపోవటం నుంచి యింతలేసి దుర్మార్గపు మాటలు వినవలసి వచ్చినందుకు కించిదుద్రేకం కలిగింది నాకు. స్త్రీ పురుషుల మధ్యనున్న ఆర్థిక వ్యత్యాసాలు తొలగించాలంటే చీరలకుకూడా పాకెట్లు కల్పించాలి అన్నారు వారు. తిరగేసి కట్టుకుంటే అది ఉండవలసిన చోట వుండక లోపలికెళ్లిపోతుంది. లేదా బ్యాక్ పోకెట్టయే ప్రమాదం వుంది జేబులు వుండి అవి ఎక్కడున్నాయో వెతుక్కోవడం కంటె జేబులేకుండా ఇతర జేబులపై ఆధారపడి బ్రతకడం మేలుకదా అన్నారువారు. నా మొహం చూసి విషయం చాలా సీరియస్ కాబోతున్నదని గ్రహించి పట్నం సుబ్రమణ్యయ్యర్ కీర్తన "అంబనీదు చరణ పంకజములె గతియని నెరనమ్మియున్న నన్ను బ్రోవుమా" అని కళ్యాణిలో అందుకున్నారు. (ప్రార్థన కుడివైపు జేబుతీసి ఎడమవైపు కుట్టమని) కుట్టనన్నాను. మీకు జేబు కుడితే స్త్రీజాతి నవమానించినట్లవుతుంది పొమ్మన్నాను. సారీ సరోజ దళనయనా అన్నారువారు. అదెవత్తి – ఆ సరోజనే కుట్టమనండి. ఎడమవైపు నుంచి కుడికో కుడి నుంచి ఎడమకో అని గసిరేశాను. పురుషులు దమతమ గోరికలీడేరేవరకూ మనన్ని బంకలా పట్టుకుని వదర్రు. తంతే (తన్నవనుకోండి) అయ్యో కాలునీ అరికాలు కందుతుంది సాక్స్ తెప్పిస్తాను తొడుక్కుంటావా అంటారు. వుత్తుత్తప్పుడు మంచినీళ్ళు బల్ల మీద వొలికితే "రాస్కెలు కళ్ళు కనపడ్డం లేదా" అంటారు. తలదువ్వు కోకుండా బజారుకెళ్ళొచ్చి ఫూల్ "తల దువ్వుకోకుండా వీధిలోకెళ్తుంటే చెప్పొద్దా" అని అగ్గయిపోతారు. నాకు మీరుకూర్చుని జడవేస్తున్నారు గనుకనా, నేను మీకు తల దువ్వటానికి

అని డొంకటర్నింగ్‌గా చెపితే "షటప్ బ్లడి బెగ్గర్ నిన్నెవరు తల దువ్వమన్నారే! నేనోటంటే నువ్వోటంటావ్., నా తల చూసి దువ్వుకున్నానో లేదో చెప్పొద్దా వీధిలో కెళ్తూంటే అని అడుగుతున్నాను. (నేనేమైనా చెప్పవద్దన్నానా) నీ మొగుడు వెర్రి వెథవలాగా తల దువ్వుకోకుండా రోడ్డుమీద తిరుగుతూంటే నీ కవమానంకాదా అని అడుగుతున్నాను. ఎడమ వేపు జేబు కుడివేపు నుంటే నీకవమానం లేదా అని అడుగుతున్నాను. లోపల బనీను కుళ్ళిపోతే జేబురుమాలు మాసిపోతే నీ సతీ ధర్మానికి కళంకం కాదా అని అడుగుతున్నాను" అంటారు రక్తకన్నీరు హీరోలాగ, నాకలాటి సెంటిమెంట్లేవీ లేవుస్మండి అంటాను. (అంట్లు అనగా అంట్లు కావు) ప్రేమ ఉన్నచోట తిట్లు కరెన్సీ నోట్లు లాగా చలామణీ అగునని పాఠకీ పాఠకులు గ్రహించాలి. మోహం లేనప్పుడు మొగుడు ముట్టుకుంటె చాలు గ్యాస్ పొయ్యిమీద స్టీలుపాత్రలా వళ్ళంతా భగాభగా మండిపోతుంది. కవులూ రైటర్సూ రాయడానికి వీల్లేని భాషలో భార్య భర్తలు మాట్లాడుకుంటారనేది ప్రేమ కథలు వ్రాసేవారికి కొంచెం కూడా తెలీదు, సెంటిమెంటు గురించి మాట్లాడుకుంటూ అంట్లమీద కెళ్ళామన్నాను కదా – రైటెబవుటరన్... ఫామిలీ లైఫ్‌లో తిని కూర్చుని జాలీగా తిట్టుకుంటూ వుండే వారి బ్రతుకుల్లో సౌండ్ ఆఫ్ మ్యూజిక్ వుంటుందని సత్తె ప్రమాణ పూర్తిగా రుజువు చెయ్యకలన్నేను.

మీది పీచు జుట్టు పాపిడికి లొంగదు. మీరు దువ్వుకున్నా దువ్వుకోకపోయినా ఒకలాగే వుంటారు, అందుకని మీ రూపు చెడిపోయిందని నేనేమీ బాధపడను, నా కలాటి సెంటిమెంట్లు లేవు. మీకుజేబు కుడివేపు వుండాలో లెఫ్టో రైటో అది మీ కర్మ.....ఎలా వున్నా నా కళ్ళకి బాగానే వుంటారు. నా మనసు ఆరోగ్యంగా వున్నంతకాలం మీరెలా వున్నా నా కంటికి దివ్య సుందర విగ్రహంలానే నాలుగు చేతుల్తో శంఖ చక్రగదాధరపాణిలా అవుపిస్తారు. మీరు నాకు దేవుడేకదా–దేవుడు టైట్ పాంట్‌వేసుకోలేదు, టెర్లిన్ స్లాక్ వేసుకోలేదు అని బాధపడతామా పడం, పడం! దేవుడికి కుడివేపు జేబున్నా ఎడమ వేపు జేబున్నా ఒకటే.... ప్రక్కల నిలబడి గొలిచే ముచ్చట దుల్పగరాదా అన్నాడు త్యాగరాజు ఖరహర ప్రియలో...నాకలాగే అనిపిస్తుంది. మీ పక్కన నిల్చున్నప్పుడు ...ఎప్పుడూ కాదు, ఎప్పుడూ ఎందుకలా అనిపిస్తుంది? దాంపత్యం ఫిలాసాఫికల్ హైట్స్‌కి రీచ్చయినపుడు అలా అనిపిస్తుంది. భక్తులకి అలా అనిపిస్తుంది. ఆ రహస్యం గిరిధారిని కొల్చిన మీరాకి తెలుస్తుంది. "సీతమ్మకు చేయిస్తి చింతాకు పతకము" అన్న రామదాసుకి తెలుస్తుంది. సంత్ కబీరుకి తెలుస్తుంది. నారాయణ తీర్థులకి తెలుస్తుంది. శ్రీకృష్ణుడ్ని రోటికి కట్టిన యశోదకు తెలుస్తుంది. శంకరాభరణంలో "ఎదుట నిలిచితే నీదు సొమ్మేమి బోవురా" అన్న త్యాగరాజుకి తెలుస్తుంది. వట్టి ఫూల్స్ కేమితెలుస్తుంది. రాగసుధారసం అంటేఏవిటో..తెలియత్తెలియదు. ఇప్పుడు చెప్పండి మీపాకెట్‌కుడివేపునుంటే నాకేవిటి? ఐ కేర్‌వెరీ లిటిల్....